ఆత్మీయ స్వాగతం

టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడివాడ విచ్చేశారు. ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ పి. జాషువా, ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు పేర్ని నాని, సింహాద్రి రమేష్‌బాబు, కొడాలి నాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని ఆప్యాయంగా పలుకరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ










క్లుప్తంగా

రామలింగేశ్వరునికి అభిషేకాలు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని మండపంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర శివలింగానికి భక్తులు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి పర్వదినం శివునికి ప్రీతి పాత్రం కావడంతో శుక్రవారం బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో భక్తులు రామలింగేశ్వరునికి, నందీశ్వరునికి శాస్త్రోక్తంగా పూజలు జరిపి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: పామర్రు 132 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోడూరు, విశ్వనాథపల్లి మందపాకల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఆలయంలో అన్నసమారాధన

అవనిగడ్డ: స్థానిక రాజరాజేశ్వరి సహిత రాజశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి అన్నసమారాధన చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సింహాద్రి రామనాథబాబు తెలిపారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



కోడూరు: వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాదచారులకు, వాహన చోదకులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్య వైశ్య ప్రముఖులు అన్నం బలరామకృష్ణ–చంద్రకళ, అన్నం శివశంకర్–శివరంజని దంపతులు ఆర్థిక సహాయం అందించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బూరగడ్డ హరినాథ్‌బాబు, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు మద్దాళి ప్రసాద్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ

అవనిగడ్డ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ పరిధిలోని సింహాద్రి కాలనీలో ర్యాలీ జరిగింది. మూడేళ్ల వయస్సు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ వర్కర్లు ఐ. ప్రేమలత, డి. పావని, వి. విజయలక్ష్మీ, భవానీ కోరారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



వక్కలగడ్డ(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషణ అందిస్తోందని సర్పంచ్ వల్లూరు ఉమా అన్నారు. శుక్రవారం వక్కలగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారి కార్యక్రమాన్ని పురస్కరించుకుని చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంతో పాటు పటిష్టమైన విద్యా బోధన అందిస్తున్నారని సర్పంచ్ వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మొవ్వ సీడీపీఓ భానుమతి, సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ దుర్మార్గంపై జగనన్న గృహ లబ్ధిదారుల ఆగ్రహం

నేడు వక్కపట్లవారిపాలెం లాకుల వద్ద లబ్ధిదారుల ధర్నా

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారిపాలెం గ్రామంలో జరుగుతున్న జగనన్న లే అవుట్ మెరక పనులను చూసి ఓర్వలేక అడ్డుకుంటున్న టీడీపీ నాయకుల తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 350 మంది గృహ లబ్ధిదారులున్న ఈ లే అవుట్‌లో మెరకతోలే పనులు చేపడితే అడ్డుకుంటూ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో టీడీపీ నాయకులు అడ్డగోలు ప్రచారం కోసం మట్టి తోలకాలను రాజకీయం చేస్తున్నారని సర్పంచి, వైఎస్సార్ సీపీ నేత అంబటి శ్యామ్ ప్రసాద్ శుక్రవారం మండిపడ్డారు. జనంలో పబ్లిసిటీ కోసం టీడీపీ నాయకులు చేపట్టే దుర్మార్గపు రాజకీయాలను అడ్డుకునే క్రమంలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో కలిసి వక్కపట్లవారిపాలెం రెగ్యులేటర్ (లాకులు) మూడు రోడ్ల కూడలిలో శనివారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తామని సర్పంచ్ వివరించారు.

రెండు పీఏసీఎస్‌లలో నూరుశాతం రుణ వసూళ్లు

నాగాయలంక: కేడీసీసీ బ్యాంకు నాగాయలంక బ్రాంచి పరిధిలోని పెదకమ్మవారిపాలెం పీఏసీఎస్‌లో 2022–23 సంవత్సరానికి నూరుశాతం రుణాలు వసూలు సాధించామని సంఘం అధ్యక్షుడు సింగోతు నాంచారయ్య శుక్రవారం తెలిపారు. సొసైటీలో 560 మంది రైతుల నుంచి స్వల్పకాలిక రుణాలు రూ.220.87 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.193.58 లక్షలు, ఇతరత్రా రుణాలు రూ.99.25 లక్షలు మొత్తం రూ.513.70 లక్షలు నూరుశాతం వసూలు జూన్16 నాటికి పూర్తి చేసారు. ఈమేరకు పత్రాలను ఆయన, సిబ్బంది మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కేడీసీసీ నాగాయలంక బ్రాంచిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన సహాయక సహకార అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, బ్రాంచి మేనేజర్ బుర్రె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రుణ వసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన సీఈఓ కేవీ రామాంజనేయులు, గుమస్తా యలవర్తి శ్రీనివాసరావు, వారికి సహకరించిన సూపర్‌వైజర్ రెహము



నూరుశాతం రుణ వసూళ్ల ధ్రువీకరణ పత్రాన్ని మేనేజర్‌కు అందజేసిన అధ్యక్షుడు, సీఈఓ

న్నీసా, ఇతర సిబ్బందిని అభినందించారు.

బర్రంకుల సొసైటీలో నూరు శాతం వసూళ్లు

మండలంలోని బర్రంకుల పీఏసీఎస్‌లో 2022–23 సంవత్సరానికి నూరుశాతం రుణ వసూలు జరిగాయని సొసైటీ అధ్యక్షుడు తోట సాయిబాబు శుక్రవారం తెలిపారు. 1009 మంది రైతులు నుంచి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు మొత్తం రూ.761.96 లక్షలు వసూలు అయ్యాయని వివరించారు.

కొల్లు ప్రమేయంతోనే మోకా హత్య

మోకా భార్య, మేయర్ వెంకటేశ్వరమ్మ


కోనేరుసెంటర్: తన భర్త, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మోకా భాస్కరరావు హత్య మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ప్రమేయంతోనే జరిగిందని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. పేర్ని నాని కుటుంబంతో తమ కుటుంబానికి సుదీర్ఘకాలంగా మంచి అనుబంధం ఉందని, ఆయనపై అవాకులు, చెవాకులు పేలితే నేనే కాదు ప్రజలు కూడా నమ్మే పరిస్థితులు లేవని ఆమె అన్నారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. టీడీపీ నాయకులది మొదటి నుంచి హత్యా రాజకీయాలేనన్నారు. చంద్రబాబు తన మామ దివంగత ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయినట్లే ఆ పార్టీలో ఉండే ప్రతి నాయకుడు అదే పంథాను అనుసరిస్తున్నారని విమర్శించారు. మోకా భాస్కరరావు హత్య జరిగినపుడు ఆయన హత్యకు కారకుడైన కొల్లును ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదంటూ తనతో స్వయంగా మాట్లాడిన కొరియర్ శ్రీను నేడు జనసేన తీర్థం పుచ్చుకుని తన భర్త హత్య గురించి, పేర్ని నాని గురించి అవాకులు, చెవాకులు పేలటం సిగ్గుచేటన్నారు. తన భర్త హత్య కేసుతో ఎటువంటి సంబంధం లేనిదే కొల్లు రవీంద్రను 52 రోజుల పాటు జైలులో ఎందుకు పెడతారో చెప్పాలని ప్రశ్నించారు. తన భర్తను హత్య చేయించింది ముమ్మాటికీ మాజీ మంత్రి కొల్లు రవీంద్రనే అని స్పష్టం చేశారు. మూడో డివిజన్ కార్పొరేటర్ శీలం భారతి మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకులు చెప్పులు చూపిస్తూ తమ నాయకుడు పేర్ని నానిని అవహేళనగా మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. బందరులో పది మంది కలిసి చెప్పులు చూపిస్తే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు చూపించే చెప్పులకు బెంబేలెత్తిపోవాల్సిందేనని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అచ్చేబా, కార్పొరేటర్ జోగి చిరంజీవి, పర్ణం సతీష్, గాజుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలతో చేరువైన సేవలు

- సబ్సిడీపై విత్తనాలు, ఎరువుల విక్రయం
- యంత్రాలు, పనిముట్లు అందజేత
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర
- నాలుగేళ్లుగా రైతులకు విశేష సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు



పెడన మండలం పెనుమల్లి రైతు భరోసా కేంద్రం



పెడన: గతంలో రైతులంటే చిన్నచూపు ఉండేది. వారి కష్టాలు కూడా ఎవరికి పట్టేవి కావు. వ్యవసాయమే దండగ అని చంద్రబాబు సైతం అన్నారు. అలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తూ రైతులకు అండగా నిలిచారు. రైతులకు అన్ని సేవలు చేరువ చేయాలనే సంకల్పంతో రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేశారు. వీటి ద్వారా విత్తనం మొదలు పంట పండి చేతికి వచ్చి మద్దతు ధర లభించేవరకు రైతులకు అండగా నిలిచారు. అటువంటి ఆర్బీకేలు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేయడంతో దేశమంతా వీటిపై దృష్టి సారించాయి. ఆర్బీకేలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.

అన్ని రకాల సేవలు..

గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సివచ్చేది. అక్కడ కూడా ఎవరూ అందుబాటులో లేకపోతే జిల్లా కేంద్రానికి వెళ్లే దుస్థితి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతి గ్రామంలోని రైతులకు అందుబాటులో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు తమ పరిధిలోనే అన్ని రకాల సేవలను పొందుతున్నారు.

కియోస్కో యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు

ఆర్బీకేలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. తమకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు 48 గంటల్లోనే రైతులకు నేరుగా అందించేలా చేస్తున్నాయి.



పెడన ఆర్బీకేలో సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

ఎరువులు, విత్తనాలు, యంత్రాల పంపిణీ

ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు హార్వెస్టర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, ట్రాక్టర్లు ఇలా వ్యవసాయనికి వినియోగించే వాటిని అందజేస్తున్నారు.

ఈ క్రాప్ బుకింగ్..పంట నష్టపరిహారం

ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపాన్ల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు సైతం రుణాలను అందజేస్తున్నాయి.

నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది



ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా నాకు నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా డబ్బులు రైతులు తమ పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతోంది.

– వుచా దేవశంకరరావు, నేలకొండపల్లి, పెడన మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఆర్బీకే సిబ్బంది ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో చేపట్టే ఈ క్రాప్ బుకింగ్‌తో మాకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పంటల బీమా పథకం కింద నష్టపరిహారం ఇస్తున్నారు. రైతులు కోసం కష్టపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– జన్ను నాగమల్లేశ్వరరావు, నందిగామ, పెడన మండలం

అందుబాటులో ఎరువులు.. విత్తనాలు



ఆర్బీకేలలో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులను, సబ్సిడీపై విత్తనాలను అందజేస్తోంది. సీజన్లతో సంబంధం లేకుండా ఆర్బీకేలలో అన్నీ దొరుకుతున్నాయి. మార్కెట్ ధర కంటే ఆర్బీకేలలో తక్కువకే లభిస్తున్నాయి. ఎరువుల దుకాణాలదారులు ఒక్కోసారి తక్కువ ధరకు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.

– తాతా ఉమాబ్రహ్మ విష్ణు మహేశ్వరరావు, జింజేరు

19న ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కేబీఆర్ ప్రభుత్వ భాగస్వామ్య శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ గొంది హరిధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అడ్మిషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన కేటగిరీలకు చెందిన అభ్యర్థులు రూ. 60 కాషన్ డిపాజిట్ చెల్లించాలన్నారు. ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 08674–245953, 82975 74757 నెంబర్లను సంప్రదించాలన్నారు.

19న ఆణిముత్యాలుకు నగదు పురస్కారాలు

పెడన: రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలోను, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు పురస్కారాలను అందిస్తోంది. ఇవి కాకుండా పెడన నియోజకవర్గంలోని పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ వ్యక్తిగతంగా నగదు పురస్కారాలను కూడా అందించనున్నారు. ఈ నెల 19వ తేదీ గూడూరు మండలం సుమా కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు నగదు పురస్కారాలను అందించనున్నారు. పెడన నియోజకవర్గంలోని 36 ఉన్నత పాఠశాలల్లో 118 మంది విద్యార్థులున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.20 వేలు, ద్వితీయ స్థానంలోని వారికి రూ.15 వేలు, తృతీయ స్థానంలోని వారికి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

పంటల నిల్వకు ప్రభుత్వ గోదాములు శ్రేయోదాయకం

రేమాలవారిపాలెం(నాగాయలంక): రైతులు తాము పండించిన పంటల ఉత్పత్తులను ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచుకోవడం ద్వారా విస్తృత ప్రయోజనాలు పొందుతారని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ అన్నారు. స్థానిక దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సొసైటీ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, పంటల నిల్వపై అవగాహన కొరవడి విధిలేక మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అధ్యయనం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థను ఏర్పాటు చేశాయని, తద్వారా గిట్టుబాటు ధరలు లభించే వరకు ప్రభుత్వ గోదాముల్లో రైతులు తమ పంటల ఉత్పత్తులను నిల్వ చేసుకుని మెరుగైన ధర పొందవచ్చునని వివరించారు. నిల్వ కాలంలో రైతులకు డబ్బు అవసరమైతే గోదాములలో పంట నిల్వ ఆన్‌లైన్ రసీదులతో బ్యాంకుల ద్వారా 60 నుంచి 80 శాతం వరకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి సహకార వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో రైతుల కోసం గోడౌన్‌ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చంటి మాట్లాడుతూ రైతులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను వివరించారు. జిల్లా సహకార అధికారి వీవీ ఫణికుమార్, మండల వ్యవసాయ అధికారి అన్నలూరు సంజీవ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు శ్రీనివాసరావు, బసవారావు, కేడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్ రెహమున్నీసా, పీఏసీఎస్ సీఈఓలు వీర్నాల టోనీ, కేవీ రామాంజనేయులు, ఆరు సొసైటీల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

ఇన్‌చార్జి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్



పల్లోటి కరస్పాండెంట్ జోజిరెడ్డితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ ప్రసాద్

పెడన: విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాట్సాప్ గ్రూపులలో వైరల్ కావడంతో ఎంఈఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కళాంజలి హైస్కూల్‌తో పాటు సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూల్‌ను పరిశీలించి సంబంధిత కరస్పాండెంట్లతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాల ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం పేర్కొన్న ధరలకు విక్రయించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

స్వామివారి సేవలో తెలంగాణ ఎమ్మెల్యే నోముల భగత్



స్వామివారి ప్రసాదం అందుకుంటున్న తెలంగాణ ఎమ్మెల్యే భగత్

మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని నాగార్జున సాగర్ (తెలంగాణ) ఎమ్మెల్యే నోముల భగత్ దంపతులు, మచిలీపట్నం ఆంధ్రా జాతీయ విద్యా పరిషత్ అసిస్టెంట్ కమిషనర్ జీవీడీఎస్ లీలాకుమార్ దంపతులు విడివిడిగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన వారు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్ధ సతీష్ శర్మ, మణిదీప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామి వారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతిగృహ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: బీసీ వసతి గృహాల్లో ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ బాలికల వసతి గృహ అధికారి నాగమణి తెలిపారు. ఈ వసతి గృహంలో బీసీలకు 75 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓబీసీలకు 9 శాతం సీట్లు ఇస్తామని చెప్పారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా శాంతికల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో కల్యాణతంతు నిర్వహించారు. పలువురు దంపతులు ఈ కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.